అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఐటీడీఏ పీవో

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మోద మంగళవారం మోద కొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, ఐటిడిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మా కనపల్లిలో తాగునీటి కష్టాలు

విశాలాంధ్ర-అనంతగిరి : అల్లూరి జిల్లా అనంతగిరి మండలం లోగల పంచాయతీ మాకనపల్లి గ్రామంలో త్రాగునీటి కష్టాలు వర్ణానతీతం గ్రామంలో సుమారుగా 40 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి ఏళ్ల తరబడి ఈ గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు గ్రామానికి కిలోమీటర్ల దూరంలో 100 అడుగులు లోతులో దిగి గ్రామస్తులు ఓటనీరును ఆశ్రయించి బతుకుతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ గ్రామనికి తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొగాకుకు వ్యతిరేకంగా ర్యాలీ

విశాలాంధ్ర-దేవీపట్నం : మండలంలోని ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి డేవిడ్, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవ సందర్భంగా పొగాకు ధూమపానంపై ప్రతిజ్ఞ, గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగినది. అనంతరం వైద్యాధికారి టి.డేవిడ్ మాట్లాడుతూ ధూమపానంవల్ల చాలా మంది ప్రాణాలు పోతున్నాయని ముఖ్యంగా అతి భయంకరమైన క్యాన్సర్‌కు గురి అవుతున్నారని ధూమపానం ఆరోగ్యానికి హానికరం అని పొగాకు తాగేవారికి పీల్చే వారికి కూడా అనారోగ్యం పాలవుతారని కాబట్టి ప్రతి ఒక్కరు ధూమపానంకి దూరంగా ఉండాలని గ్రామస్తులకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి టి. డేవిడ్, పీహెచ్ఎన్ లలితాకుమారి, ఎంపిహెచ్ఈఓ కోసు శ్రీనివాస్ దొర, హెచ్‌వి రమణ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు అధైర్య పడొద్దు

విశాలాంధ్ర-కూనవరం : ఎన్నికలలో ఓడిపోయినంత మాత్రాన కార్యకర్తలు శ్రేయోభిలాషులు ఎవరూ అధైర్య పడవద్దు అని ఆ పార్టీ నాయకులు ఆవుల మరియదాసు మండల అధ్యక్షులు ఆలూరు కోటయ్య అన్నారు రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అంత గొప్ప వాళ్లే ఎన్నికలలో ఓటమిని చవిచూశారని గెలుపు ఓటమి అనేవి సహజమని దానిని అంత సీరియస్ గా తీసుకోవద్దని అన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ఎప్పుడు ప్రజలతోనే ఉంటామని భరోసా ఇచ్చారు ఈమేరకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో తమ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ ప్రకటన ఇనచ్చిన వారిలో కార్పెంటర్ యూనియన్ అధ్యక్షులు ఎలిపే రమేష్, దికొండ లక్ష్మీ ప్రసాద్ గంగాధర్ కొమ్మని మోహన్ రావు తదితరులు ఉన్నారు.

నేడే ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

ప్రజారంజక పరిపాలనకు శ్రీకారం... తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర-చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నాలుగవసారి ప్రమాణ స్వీకార కార్యక్రమం నేడు కేసరపల్లి వేదికగా ఘనంగా జరగనుందని ఆపార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. ఆపార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్ లతో కలిసి మంగళవారం ఆయన మాట్లాడుతూ వైకాపా రాక్షస పాలనకు చరమగీతం పాడిన ప్రజలు ఎన్డీఏ కూటమిని ఆశీర్వదించారన్నారు. గత ఎన్నికలలో 151 స్థానాలు ఇచ్చిన ప్రజలను వైకాపా ప్రభుత్వం గడచిన ఐదేళ్లు నిలువునా మోసగించిందన్నారు. అభివృద్ధిని విస్మరించిన వైకాపాకు తగిన సమయంలో ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. అధికార గర్వంతో వై నాట్ 175 అన్న వైకాపాను ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేశారన్నారు. గతంలో ఎన్నడూ కనీ, విని ఎరుగని రీతిలో ప్రజలు ఎన్డీఏ కూటమికి, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి 135 స్థానాలు ఇచ్చి అనుభవిజ్ఞుడైన చంద్రబాబు నాయుడుని ఆశీర్వదించారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆలోచన చేసే నిరంతర ప్రజా శ్రామికుడు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేడు ముఖ్యమంత్రిగా నాలుగవసారి ప్రమాణస్వీకారం చేస్తున్న ఆయనకు చింతపల్లి మండల కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

సీఎం ప్రమాణ స్వీకారోత్సవం ప్రత్యక్ష ప్రసారం : కలెక్టర్ విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం ఫరిధిలో ప్రజలంతా వీక్షించడానికి వీలుగా ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 11.27 నిమిషాలకు మేధ ఐటి పార్క్ (గన్నవరం విమానాశ్రయం ఎదురుగా) కేసరపల్లి విజయవాడలో ప్రమాణ స్వీకర మహోత్సవం జరుగనున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఆయా మండల అభివృద్ధి కార్యాలయాలలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ విధానంలో ప్రత్యక్ష ప్రసారం నిర్వహిస్తామని, ప్రత్యక్ష ప్రసారం 12వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి ప్రారంభం అవుతుందన్నారు. వాటితో పాటు నియోజక వర్గాల ప్రధాన కేంద్రాలలో బిగ్ టివి ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. పాడేరు నియోజకవర్గంలో పాత బస్ స్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద, అరకు నియోజకవర్గంలో గిరిజన మ్యూజియం దగ్గర, రంపచోడవరం నియోజకవర్గంలో ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణంలో బిగ్ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించే విధంగా ఏర్పాటు చేసినట్లు ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

దేశం చూపు... భారతీయ జనతా పార్టీ వైపు

పండిట్ జవహర్లాల్ నెహ్రూ రికార్డును సమం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ
బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలయ్య పడాల్

విశాలాంధ్ర-చింతపల్లి : ముచ్చటగా మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోడీ మాజీ ప్రధానమంత్రి దివంగత పండిట్ జవహర్లాల్ నెహ్రూ ప్రధానిగా వరుసగా మూడుసార్లు చేసిన ప్రమాణ స్వీకారాన్ని సమం చేయడం హర్షించదగ్గ శుభపరిణామమని బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోనంగి బాలయ్య పడాల్ అన్నారు. మండలలో తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో ఆ పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కదుళ్ల శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు సాగిన బాలకృష్ణ లతో కలసి మంగళవారం మూడు కిలోల కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేసి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట రికార్డును సమం చేశారన్నారు. బిజెపితోనే దేశ భవిష్యత్తు సాధ్యమని మరో మారు రుజువైందన్నారు. దేశం యావత్తు నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్షేమమే సత్ఫలితాన్ని ఇచ్చింది

అధికారం చేజారిన మన్య ప్రాంతంలో సత్తా చాటాం

విశాలాంధ్ర-చింతపల్లి : రాష్ట్రంలో అధికారం చేజారిన మన్య ప్రాంతంలో సత్తా చాటామని, గడచిన ఐదేళ్లు తమ ప్రభుత్వం అందించిన సంక్షేమమే సత్ఫలితాన్ని ఇచ్చిందని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. సార్వత్రిక ఎన్నికలలో పాడేరు నియోజకవర్గం నుంచి వైకాపా శాసన సభ్యునిగా విజయం సాధించిన మత్స్యరాస విశ్వేశ్వర రాజును చింతపల్లి సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్‌వల్లి, పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, పంచాయతీ వార్డు సభ్యులతో కలిసి ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో అందించిన సంక్షేమం మన్య ప్రాంతంలో వైకాపా విజయానికి దోహద పడిందన్నారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించడంలో మన్యవాసులు ఎప్పుడు ముందుంటారని సార్వత్రిక ఎన్నికలలో మన్యంలో నమోదైన విజయాల ద్వారా మరో మారు రుజువైందన్నారు. గడచిన మూడు దఫాలుగా మన్యవాసులు వైకాపాను ఆశీర్వదిస్తున్నా రన్నారు. విశ్వేశ్వర రాజు విజయం వైకాపా హ్యాట్రిక్ విజయమని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం

విశాలాంధ్ర - సీలేరు : సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి మినీ జలవిద్యుత్ కేంద్రాన్ని యూనిట్ సింకర్‌నైజ్ చేసి యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించామని ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఛీఫ్ ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు పూర్తి కావడంతో ఈ పనులు ప్రారంభమయ్యాయన్నారు. విద్యుత్ ఉత్పత్తికి ఆదేశాలు వెలువబడిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం 6.06నిమిషాలకు యూనిట్ వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. మొదటిగా 115మెగావాట్ల లోడ్ వేశామని చెప్పారు. ప్రస్తుతం పవర్ కెనాల్ 8.5 అడుగుల నీరు వెళుతుందన్నారు. కెనాల్ నిర్వహణ పనుల నేపథ్యంలో క్రమేపీ విడుదల పెంచుతామన్నారు.

కక్షలు కార్పణ్యాలు మానండి... అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించండి

వైకాపా ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

విశాలాంధ్ర-చింతపల్లి : ఎన్డీఏ కూటమి నాయకులు కక్షలు కార్పన్యాలు మాని రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని వైకాపా ఎస్టీ కమిషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏ కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టిన నేపథ్యంలో వైకాపా శ్రేణులపై కూటమి పార్టీలకు చెందిన శ్రేణులు దాడులకు తెగబడడం మంచి సంస్కృతి కాదన్నారు. గడచిన ఐదేళ్లుగా తమ ప్రభుత్వం (వైకాపా) ప్రజారంజకంగా సంక్షేమ పాలన అందించినప్పటికీ సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా పరాజయం పాలవడం బాధ కలిగిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కుల, మతాలు పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా నేరుగా లబ్ధిదారులకు అందేలా సంక్షేమ పథకాలు అందించినప్పటికీ కేంద్ర రాష్ట్రాలలో అధికారమే ప్రధాన అజెండాగా రాష్ట్రంలో తెదేపా, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజెపితో కూటమి కట్టి అమలు సాధ్యం కానీ హామీలతో ఒంటరిగా పోటీ చేసిన వైకాపా పరిపాలనపై తప్పుడు ప్రచారం చేసి ఎన్నికలలో గెలిచారన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును వైకాపా స్వీకరిస్తుందని, అదేవిధంగా ఎన్డీఏ కూటమికి ప్రజలిచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేసుకోకుండా పరిపాలించవలసిన సమయంలో వైకాపా నాయకులపై, వారి ఇళ్లపై కూటమి పార్టీల శ్రేణులు దాడులకు తెగబడడం మంచి సంస్కృతి కాదన్నారు. ప్రజలకు ఎంత మేలు చేసినా, కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలు ఇంకేదో మేలు చేస్తాయనే భ్రమలో ప్రతిపక్ష పార్టీలు చేసే మోసపూరిత ప్రకటనలు నమ్మి జెండాలు తప్ప అజెండా లేని ఎన్డీఏకు ప్రజలు కేంద్ర, రాష్ట్రాలలో అధికారం కట్టబెట్టారన్నారు. ఏకపక్ష విజయం సాధించామని తెదేపా శ్రేణులు దాడులకు దిగుతున్నారని, ఇటువంటి దాడులను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రతిపక్ష హోదా లేకున్నా తమకు ప్రజాబలం ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజా పక్షాన వైకాపా పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

ప్రజారోగ్య దృష్ట్యా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ను నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె. శ్రీనివాస్ అన్నారు.మున్సిపాలిటీ లోని ప్రతీ వార్డులో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రభలకుండా ఉండుటకు దోమల నివారణ ఆవశ్యమని, అందుకు ఎక్కడా నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.అన్ని వార్డుల్లోను, పూడికలు తొలగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు,కీటకాల నాశనానికి బ్లీచింగ్ చల్లడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జన, కొలాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టడం జరుగుతుందని, తాగునీటి సరఫరా పైపుల పరిస్థితిని తనిఖీ చేయడం, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారి చేయించడం, మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్ప్రేయింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమలో శానిటరీ ఇన్స్పెక్టర్ మురళీ, జూనియర్ జెఎస్ఓ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చూసేందుకు ఏర్పాట్లు

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారని ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు చూసేందుకు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు వీక్షించేందుకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లోనూ, లయన్స్ కల్యాణ మండపంలోను, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను ప్రత్యేక టీవీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈటీవీల ద్వారా ప్రజలు ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారాన్ని వీక్షించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు కొనసాగుతుందన్నారు.

జోగంపేటలో మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని జోగంపేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత ఆరుబయట పడుకున్న మరిశర్ల సుగుణ అనేమహిళమెడలో రెండు తులాల ముప్పావు బంగారపు పుస్తెలు తాడును దొంగలు కట్ చేసి పట్టుకుని పారిపోయారు . దీనిపై వారు వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేసవికాలంలో మండుటెండలు ఉన్నందున ప్రజలు వేడిని, ఉక్కను తట్టుకోలేక బయటమంచాలను వేసుకొని నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటాక గాడనిద్ర చేస్తున్న సమయంలో దొంగలు హల్చల్ చేసి దొంగతనాలుచేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంచార్జి ఎస్ఐ పాపారావు తెలిపారు. పార్వతీపురం సిఐ రవికుమార్, ఎస్ఐ పాపారావులు సంఘటన స్థలాన్ని కూడా పరిశీలించి అన్నికోణాల్లో దర్యాప్తు ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. క్లూస్ టీమ్ కూడా సందర్శన చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఎస్సై పాపారావు మాట్లాడుతూ జోగమ్మపేటలో జరిగిన సంఘటనపై పరిశోధన ముమ్మరంగా చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో విరివిగా దొంగతనాలు జరుగుతున్నట్లు తెలియజేశారు. వేసవి దృష్ట్యా ఆరుబయట పడుకునే వారంతా ఇళ్లకు తాళాలువేసి తగుజాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అన్నిగ్రామాల్లో ఇటీవల కాలంలో దొంగలు హల్ చల్ చేయడం జరుగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అన్ని గ్రామాల్లో సచివాలయ మహిళా పోలీస్ సిబ్బంది ప్రజలను మరింత అప్రమత్తమయ్యేలా తగు సూచనలు తెలియచేయాలన్నారు. గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్ కు లేదా 100కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలివెళ్ళిన ఆర్టీసీ బస్సులు

విశాలాంధ్ర -పార్వతీపురం/ సీతానగరం/బలిజిపేట : నేడు విజయవాడ దగ్గర గన్నవరంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పార్వతీపురం నియోజకవర్గం నుండి నాలుగు ఆర్టీసీ బస్సులను వేయడం జరిగిందని అధికారులు తెలిపారు. సీతానగరం పార్వతీపురం బలిజిపేట మండలాలతో పాటు పార్వతీపురం పురపాలక సంఘంకు ఒక్కొక్క బస్సును ఏర్పాటు చేశారు. ఎంపీడీవోలు దగ్గరుండి బస్సులను జండా ఊపి ప్రారంభించి పంపించే ఏర్పాట్లు చేశారు. బస్సులలో టిడిపి నాయకులతోపాటు వారిని సమన్వయం చేయడానికి పంచాయతీ సిబ్బందినీ నియమించారు. సీతానగరం మండలంలో బయలుదేరిన బస్సును ఎంపీడీవో ఈశ్వరరావు, పరిపాలన అధికారి ప్రసాద్, మండల పరిషత్ సిబ్బంది చిన్నారావు, శేఖర్, ప్రసాద్, టిడిపి నాయకులు సాల హరిగోపాల్, బొమ్మినాయునిలక్షణరావు, మర్రాపు చిరంజీవి, భాస్కరరావు తదితరులు జెండాఊపి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన టిడిపి ప్రజాప్రతినిధులు నాయకులతో పాటు పంచాయతీ కార్యదర్శులు పిల్లి మురలీకృష్ణ, బి కామేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

విశాలాంధ్ర-బెలగాం : 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో దేశంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అపూర్వ ఆదరణ చూపించారని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని ఈ ఎన్నికలు నిరూపించాయని పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బత్తిన మోహనరావు తెలిపారు. ఈసందర్భంగా పార్వతీపురం నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికలలో సహకరించిన నియోజకవర్గ ప్రజలందరికీ కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున పేరుపేరునా అభినందనలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మరియు అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషిచేయాలని జిల్లాస్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని తెలియజేశారు. ప్రజా సమస్యల పట్ల కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కూడా ప్రజలపక్షాన పోరాటం చేస్తుందని తెలియజేశారు. రాబోతున్న రోజులలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగుతామని తెలియజేశారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చొక్కాపు వెంకటరమణ, తీళ్ల గౌరీశంకర్, జమ్మాన ప్రవీణ్ కుమార్, పట్లాసింగ్ రవికుమార్, బొమ్మాలి మోహనరావు, మీసాల సురేష్ పాల్గొన్నారు.

నీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తిచేయాలి

కొత్త ప్రభుత్వానికి ఏపీ రైతు సంఘం స్వాగతం చెప్తూ విజ్ఞప్తి...

విశాలాంధ్ర-పాలకొండ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మంగళవారం పాలకొండలో మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు ముందు చూపుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఐటీ రంగం ద్వారా ప్రపంచ పటంలో గుర్తింపు తెచ్చారు. ఐటీ రంగంలో వేలాది మందికి ఉపాధి కల్పించారు. అప్పట్లో ఉన్న ఆంధ్రప్రదేశ్ లో ఫ్యాక్షనిజం నుంచి ప్రశాంత వాతావరణంలో ఉపాధిని కల్పించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదురులేని తీర్పునిచ్చారు. కేంద్రంలో బిజెపికి తెలుగుదేశం పార్టీతో జత చేయడంలో ప్రధాన భూమిక వహించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చొరవ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని రాష్ట్ర అభివృద్ధి కోసంముందుకు సాగుతారని ఆశిస్తూ విభజన హామీ చట్టంలో పొందుపరిచిన అంశాలను రాజధాని అమరావతికి,పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధులు తీసుకురావడంలో సఫలం కావాలని, కేంద్ర ప్రభుత్వాన్ని శాసించే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేయాలని స్వాగతం పలుకుతున్నాం. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ సంస్థలో కొనసాగించుటకు, రైల్వేజోనుకు కావలసిన నిధులు, ఉపాధి కల్పించుటకు పెట్టుబడులుతో పాటు బాబు జగజీవన్ రామ్ ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ద్వారా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగు నీరిచ్చుటకు కొత్త ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నాం. పోలవరం ప్రాజెక్టు దగ్గర ఎత్తిపోతల పథకంతో (తాత్కాలిక) కృష్ణ, గోదావరి అనుసంధానం సఫలీకృతం కావడంతో ఆనంద ఉత్సవ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదుల అనుసంధాన ప్రక్రియ ఆదరా బాదరాగా నిపుణులు ఇచ్చిన డిజైన్ మార్చి అడ్డదిడ్డంగా ఎవరికి పనికిరాని పద్ధతుల్లో జరిగిన నదుల అనుసంధాన పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇప్పటికైనా శాస్త్రీయ పద్ధతుల్లో వంశధార, నాగావళి నదుల అనుసంధాన పనులు చేపట్టి బూర్జ మండలో ఓపెన్ హెడ్ చానల్స్, ఓనిగెడ్డ ఆయుకట్టు 20,000 ఎకరాలను స్థిరీకరించి రైతుల ఆశలను నెరవేర్చాలని ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరఫున విజ్ఞప్తి చేస్తు కొత్త ప్రభుత్వానికి స్వాగతిస్తున్నామన్నారు.

ప్రకృతిలో వ్యవసాయం చేయాలి

ఎమ్మార్వో, వెలుగు ఎపియమ్ సుందరమ్మ

విశాలాంధ్ర-జి.మాడుగుల : మండల కేంద్రంలో మంగళవారం పకృతిలో వ్యవసాయం చేయాలంటూ నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో, వెలుగు ఎపియమ్ సుందరమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సిబ్బందికి. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన ఆహార ఉత్పత్తులు ప్రతి వారం అమ్మకాలు జరిగేలా చూడాలని వారు అన్నారు. అలాగే సేంద్రియ పద్ధతుల్లో ఎటువంటి రసాయనాల వాడకుండా పండే కూరగాయలను రైతులకు అందుబాటులో ఉండే విధంగా ప్రతి రోజు అమ్మకాలు జరగాలని ప్రకృతి సిబ్బందిని కోరారు. వెలుగు అనుసంధానంగా ప్రకృతి సిబ్బంది డ్వాక్రా మహిళ రైతులకు అవగాహన పరుస్తూ 32 మంది వివో రైతులకు క్షేత్ర స్థాయి శిక్షణ ఇస్తున్నట్టు వారు తెలిపారు. రైతులంతా తమ వ్యవసాయ విధానాలు పూర్వ కాల పద్ధద్వారా సేంద్రియ పద్ధతుల్లో జీవ అమృతలతో ఎటువంటి రసాయనాల వాడకుండా తమ వ్యవసాయ భూమిని కాపాడుకుంటూ ఆరోగ్యమైన పంటలు పండించుకుని తను తింటూ, మిగులు పంట అమ్ముకోవాలని వారు అన్నారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్చార్జి మేడ ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వివో నుండి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలు అమ్ముకొనేవి మండల కేంద్రంలో వచ్చి అమ్ముకో వచ్చిన ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిరం యూనిట్ ఇన్చార్జి రామలింగం, వెలుగు రైతుమిత్ర సిసి నారాయణ రావు, డివిజన్ కోఆర్డినేటర్ గణపతి, వెలుగు సిబ్బంది. సీసీలు, పకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శాసనసభపక్ష సమావేశానికి హాజరైన పార్వతీపురం ఎమ్మెల్యే...

విశాలాంధ్ర-పార్వతీపురం : పార్వతీపురం ఎమ్మెల్యేగా టిడిపి నుండి గెలిచిన బోనెల విజయచంద్ర మంగళవారం జరిగిన శాసనసభపక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఆయన సీనియర్ ఎమ్మెల్యేలతో కలిసి ముందు వరుసలో కూర్చుని శాసనసభ పక్ష నేతగా ఎంపికైన చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం పూర్తయ్యాక గురువారం నియోజకవర్గానికి వస్తున్న బోనెల విజయ్‌చంద్రకు ఘన స్వాగతం పలికేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రమాణస్వీకారానికి పెద్దఎత్తున తరలివెళ్ళిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర- సీతానగరం : నేడు గన్నవరంలో తెలుగుదేశం పార్టీ, జనసేన బీజేపీ ఎన్డిఏ ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రిమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలం నుండి పెద్దఎత్తునటీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లినట్లు మండల టిడిపిఅధ్యక్ష,కార్యదర్శులు పెంట సత్యం నాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, సాలహరి గోపాల్, తెంటు వెంకట అప్పలనాయుడు, కంకణపల్లి అరవింద్ కుమార్, క్లస్టర్ ఇన్చార్జులు బుడితి శ్రీనివాసరావు, రామకృష్ణనాయుడు, లక్ష్మణరావు, తేలు శేఖర్, గొట్టాపు అప్పారావు లు తెలిపారు. మండలంనుండి సుమారు 15 ప్రైవేట్ వాహనాలతోపాటు ఒక ఆర్టీసీబస్సు ద్వారా పెద్దఎత్తున తరలివెళ్లడం జరిగిందన్నారు. మండలంలోని 35 పంచాయతీల నుండి టిడిపి అభిమానులు తరలివెళ్లినట్లు వారి తెలిపారు. ఇదిలా ఉండగా జనసేన నుండి కూడా కార్యకర్తలు అభిమానులు వెళ్లినట్లు ఆపార్టీఅధ్యక్షులు పాటి శ్రీనివాసరావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరుకు గాయాలు

విశాలాంధ్ర-సీతంపేట : కుడ్డపల్లి సమీపంలో అక్కన్నగూడ గ్రామానికి చెందిన సవర సన్యాసి, సవర రాజారావు పాలకొండ నుండి తమ పనులు చూసుకుని ద్విచక్ర వాహనంపై ఓవర్ స్పీడ్ తో పల్సర్ బైక్ వస్తూ కుడ్డపల్లి సమీపంలో రహదారి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించిపోయి అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో కంటి భాగంలో మరియు కాలు ముడుకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. వైద్య సేవలు నిమిత్తం ఆసుపత్రికి తరలించి, ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్ చేయడం జరుగుతుంది ఏఎస్ఐ సంజీవరావు తెలిపారు.

మలేరియా నివారణకు చర్యలు

లంబసింగిలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి సత్యనారాయణ,

విశాలాంధ్ర-చింతపల్లి : మలేరియా రహిత సమాజమే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి సత్యనారాయణ అన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు మలేరియా మాసోత్సవాలు సందర్భంగా వైద్యసిబ్బంది లంబసింగిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి జిల్లా వాతావరణపరంగా బిన్నంగా ఉంటుందని, గ్రామాల్లో దోమలు పెరగకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా బారిన పడకుండా వ్యాధి పట్ల వైద్య ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేస్తున్నారని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఎంపీహెచ్ఐవో మురళి, హెచ్వి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-సీతానగరం : జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ సూచనల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరముగా పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఎంపీడీవో ఈశ్వరరావు ఈఓపిఆర్డి కుమార్ వర్మ, ఆర్డబ్ల్యూఎస్: జూనియర్ ఇంజనీర్ పవణ్ లు తెలిపారు. మంగళవారం నాడు మండలంలోని లచ్చయ్యపేట అంటిపేట కాసాపేట, చినబోగిలి,బగ్గందొరవలస దయానిధిపురం, సూరంపేట, గుచ్చిమి గ్రామాల్లో జరుగుతున్న కాలువాల్లో పూడికతీత పనులను వారు ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండోవిడత అన్నిగ్రామాల్లో పారిశుధ్యం తొలగించే పనులు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. పంచాయతీలలో కలెక్టర్ ఆదేశముల మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని,మురుగు కాలువలు శుభ్రపరచుట, దోమల నివారణ మందులు స్ప్రే చేయుట, మంచి నీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలను పరిశుభ్రముగా ఉంచాలని, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, మలేరియా ప్రబలకుండా కాలువల్లో బ్లీచింగ్ పిచికారి చేయాలన్నారు, అన్ని గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రత్యేక డ్రైవ్ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్లు పంచాయతీ కార్యదర్శులు పిల్లి మురళీకృష్ణ, శశిభూషణరావు, మనోహర్, శ్రీనివాసరావు, సంతోష్ కుమార్, ధనలక్ష్మి, టి అశోక్ ,వెలుగు గ్రామైక్య సంఘాల సభ్యులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నేడు ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా గత మూడు రోజుల నుండి మండల పరిషత్ కార్యాలయాన్ని విద్యుదీకరణ లైట్లతో అలంకరణ చేయడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. ముఖ్యమంత్రిగా నేడు ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రజలు నేరుగా చూసేందుకు మండలంలో నాలుగు ప్రధాన కూడల వద్ద నాలుగు స్క్రీన్ టీవీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కూడా విద్యుదీకరణ లైట్లు ఏర్పాటుచేసి అలంకరణ చేసినట్లు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

ఎన్డీఏ ప్రభుత్వాలు అనుసరించబోయే విధానాలను ప్రజలు ప్రశ్నించాలి

సిపిఐ మావోయిస్టు ఏఓబి కార్యదర్శి గణేష్

విశాలాంధ్ర-జి మాడుగుల: సొంత బలంతో కేంద్రంలో అధికారం స్థాపించలేకపోయిన బిజెపి అవకాశవాద రాజకీయ పార్టీలతో కలెగూర గంపగా ఎన్డీఏ ప్రభుత్వంగా ముందుకు వచ్చిందని, కేంద్రంలో రాష్ట్రంలో ఎన్డీఏ అనుసరించబోయే రాజకీయ ఆర్థిక విధానాలపై ప్రజలు ప్రశ్నించాల్సిందిగా సిపిఐ మావోయిస్టు ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ ప్రకటన ద్వారా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన విభజన హామీలను అమలు చేస్తారా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదనే కారణంతో 2018లో టీడీపీ చంద్రబాబు ఎన్డీఏ నుండి వైదొలగి , తిరిగి ఇప్పుడు ఎన్డీఏలో భాగస్వామి అయ్యాడు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రం హామి ఇచ్చిందా? అన్నది స్పష్టం చేయాలన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని అమలు చేస్తారా? ప్రకటించాలనీ, విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం అమ్మకానికి పెట్టింది. ఆ నిర్ణయాన్ని నిలిపివేసి ప్రభుత్వ రంగంలో కొనసాగిస్తారా అనేది తేల్చాలని అన్నారు. ఉద్యోగ ఉపాధి కల్పన చేయాలన్నారు. ముస్లింలకు కేటాయించిన 6 శాతం రిజర్వేషనన్ను అమలు చేస్తారా లేదా ప్రకటించాలని, మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పించే సీఏఏను రాష్ట్రంలో అమలు చేస్తారా? వ్యతిరేకిస్తారా? తెలియజేయాలన్నారు. జీఓ నెం 89ను రద్దు చేస్తారా, జీఓ నెం 3పై ప్రభుత్వ వైఖరిని ప్రకటించాలన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలపై అక్రమంగా మోపబడిన కేసుల్ని ఎత్తివేస్తారా? లేదా ప్రకటించాలని, దీంతోపాటు రాష్ట్రంలో కేంద్రంలో నెలకొని ఉన్న అనేక సమస్యలపై ఆ పార్టీ స్పష్టమైన విధానాలు ప్రకటించాలని గణేష్ డిమాండ్ చేశారు.

పిహెచ్సిలో ఆశాడే కార్యక్రమం

వైద్యాధికారి డాక్టర్ ఎస్ సంతోష్ కుమార్, హెచ్వి ఉదయకుమారి ఆశవర్కర్లకు సూచనలు

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆశడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.సంతోష్కుమార్ మాట్లాడుతూ కిల్కారి కాల్స్పై అవగాహన కల్పించటంలో ఆశలు అనుసరించవలసిన అంశాలు గురించి పలు సూచనలు సలహాలు అందజేశారు. డయేరియా, విరోచనాలు, వాంతులు, రాకుండా ఉండేలా తగు సూచనలు చేశారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లోకి వస్తున్న 104 వాహనమును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఆశ యాప్లో ఎప్పటికప్పుడు డేటా అప్డేట్ చేయాల్సి ఉందన్నారు. చిన్న పిల్లల్లో కనిపించే చిన్న చిన్న వ్యాధులు ఎలా గుర్తించాలనే అంశంపై వివరించారు. హైరిస్క్ గర్భిణీలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలో డాక్టర్ సంతోష్ కుమార్ సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్వి చింతాడ ఉదయకుమారి మాట్లాడుతూ గర్భిణీలకు వైద్య, పరీక్షలు సకాలంలో నిర్వహించడంతోపాటు గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారికి ఏమీ అయిన ఇబ్బంది వచ్చినయెడల తక్షణమే సమాచారం ఇవ్వాలన్నారు. పిహెచ్సిలో సాధారణ ప్రసవాలు జరిగేలా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. రక్తహీనత, హైరిస్క్ సమస్యలకు గర్భిణీలు గురికాకుండా వైద్య, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పిలు, ఎ ఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మలేరియా నియంత్రణకు సమిష్టి కృషి

జిల్లా మలేరియ అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు

విశాలాంధ్ర-సీతంపేట : దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఏజెన్సీలో మలేరియా నివారణకు సమిష్టి కృషి చేయాలని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష జరిపారు. గ్రామాల్లో మలేరియా తదితర జ్వరాలు ఏ మేరకు నమోదు అవుతున్నాయి,ఏ విధమైన నియంత్రణ చర్యలు చేపడుతున్నారు మొదలైన అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు.జ్వరాలను సకాలంలోగు ర్తించి,క్షేత్ర స్థాయిలోనే నిర్ధారణ పరీక్షలు జరపాలని ఆదేశించారు. డ్రైడే కార్యక్రమాలు ప్రతీ రోజూ నిర్వహించి దోమల లార్వా నిర్మూలన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలన్నారు.ఆరోగ్య సమస్యలు గుర్తించడంలో జాప్యం వహిస్తే తగుచర్యలు ఉంటాయన్నారు. మారుమూల గ్రామీణ ప్రజలకు ఆ పరిధిలో ఉన్న వెల్నెస్ కేంద్రాల్లో వైద్యసేవలందించాలన్నారు. గర్భిణీ, శిశువుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా స్థానికంగా అవగాహన ర్యాలీ నిర్వహించి మలేరియా నియంత్రణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఎస్.భాను ప్రతాప్, ఏఎంఓ సూర్యనారాయణ,సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు,కార్యాలయ సిబ్బంది ప్రసాదరావు,ఈఓ రాజారావు, సూపర్వైజర్స్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుధ్య డ్రైవ్ ముమ్మరంగా చేస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ తెలిపారు.మంగళవారంనాడు పెద్ద ఎత్తున డ్రైవ్ ను నిర్వహించామని తెలిపారు సీతానగరం మండలంలోని కాసాపేట, చినభోగిల, లచ్చయ్య పేట, అంటిపేట తదితర గ్రామాలలో కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్ఓ) కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారి చేయించారు. జిల్లాలో గ్రామ పంచాయతీ స్థాయిలో పూడికలు తొలగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగింపు, బావులు, కొలాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా వివిధ పనులు చేపట్టారు. జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటి నుండే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దోమలపై దండ యాత్ర చేపట్టారు. జిల్లాలో దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి లార్వా వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ చర్యలు చేపట్టారు. దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్లు, ఇతర కీటక నాశని పదార్థాలు ఉపయోగించడం, తాగు నీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయడం, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ధ వహించారు. బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జన చర్యలు చేపట్టారు. ప్రజారోగ్య ఆవశ్యకత దృష్ట్యా పలు కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ విస్తరణ అధికారులు ఆర్డబ్ల్యూఎస్ జేఈలు, వెలుగు గ్రామైక్య సిబ్బంది,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ గణపతిరావు, డాక్టర్ సురేష్ కుమార్లు వెల్లడి

విశాలాంధ్ర - గరుగుబిల్లి : వర్షాకాలం సీజన్ లో పశువులకు ఆశించే పలు రకాల వ్యాధులపై పశుసంవర్ధక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గరుగుబిల్లి ఏరియా పశు వైద్య శాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి గణపతిరావు వెల్లడించారు. మండల పరిధిలోని ఉల్లిభద్ర గ్రామంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయా గ్రామాల పశుసంవర్ధక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి గణపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో పశుసంవ ర్ధక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను నిర్దేశించిన సమయంలోగా రైతులకు అందజేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలకు సంబంధించి సిబ్బంది నిర్దేశించిన సమయంలోగా లక్ష్యాలను అధిగమించాల్సి ఉందన్నారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను సకాలంలో వేయాల్సి ఉందన్నారు. అదే విధంగా గొర్రెలు, మేకలకు, చీడపారుడు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పశువైద్య సిబ్బంది మంత్రబుద్ది శ్రీరాములునాయుడు, ఏ వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీలపరిశీలన

విశాలాంధ్ర. వి. ఆర్. పురం. చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రాబోవు శబరి గోదావరి వరదల దృష్ట్యా ముందస్తు చర్యలో భాగంగా మండల ఎంపీడీవో ఆర్.ఫణింద్ర మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు కేటాయించినటువంటి ఆర్ అండ్ ఆర్ కాలనీలను పశ్చిమగోదావరి జిల్లాలోని బుట్టాయిగూడెం మండల పరిధిలోని రామన్నగూడెం , జంగారెడ్డిగూడెం మండల పరిధిలోని తాడువాయ ఆర్ అండ్ ఆర్ కాలనీలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఆర్ అండ్ ఆర్ కాలనీలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు తెలుసుకోవడం కోసం వచ్చినట్లు తెలిపారు రానున్న వరదల కారణంగా నిర్వాసిత ప్రజలకు ఎటువంటి ఆటంకాలు ఇబ్బందులుకలగకుండా తమకు కేటాయించిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో నిర్వాసితులు క్షేమంగా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవడంలో భాగంగానే కాలనీ పర్యవేక్షించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్య క్రమం లో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు... చేయూతను ఇవ్వండి...

బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ పై టేకు కలప ఇప్పించాలి : రామకృష్ణ

విశాలాంధ్ర-ఎటపాక : ముంపు మండలాల్లో ఉన్న కలప డిపోల నుంచి కార్పెంటర్లకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ పై టేకు కలప ఇప్పించాలి అని చింతూరు డివిజన్ సూర్య చంద్ర కార్పెంటర్ యునియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి రామ కృష్ణ మంగళ వారం నెల్లి పాక గ్రామంలో జరిగిన పత్రిక సమావేశం లో పాల్గొని మాట్లాడారు.ఏజన్సీ ప్రాంతాల్లో ఎన్నో ఏండ్లుగా చేతి వృత్తిని నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న కార్పెంటర్ లా పరిస్థితి అద్వానంగా ఉంది అని అవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తి చేస్తేనే జీవనోపాధి లేకుంటే లేదు అని అన్నారు. కార్పెంటర్ లకు బ్యాంక్ రుణాలు ఇప్పించాలి అని అన్నారు. ముంపు మండలాల్లో కార్పెంటర్ ల పరిస్థితి దయనీయంగా ఉంది అని దీనిని అధికారులు దృష్టి లో ఉంచుకొని వారికి ఉపాధి కల్పించే విధంగా తీసుకోవాలి అని అన్నారు. కలప డిపో లో కలప కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేక చేతి వృత్తి పనులు కుంటు పడుతు వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి అని అన్నారు.చేతి వృత్తులు ను చేతి లో ఉంచుకున్న నాయకుల చేతి నుంచి అధికారం చేజారదు అని హితవు పలికారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి అని అలాగే టీడిపి ప్రభుత్వం హయం లో కార్పెంటర్ ల సంక్షేమం కోసం అమలు చేసిన ఆదరణ పథకం ద్వారా మిషన్ టూల్స్ కిట్స్ కోసం ముంపు మండలాలు చేతి వృతి వారి వద్ద నుంచి డిపోజిట్ చేసిన నగదు తో కార్పెంటర్ లకు కిట్స్ మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో గాదె వీర భద్ర చారి మద్దోజు విశ్వనాథం, పి.వి రమణ చారి, వీరయ్య, రాము, ,శ్రీను, అప్పాల స్వామి, ఈశ్వర చారి భాస్కర్,అప్పారావు,వీర భద్ర చారి,సన్నీ బాబు, రవి కుమార్,తదితరులు పాల్గొన్నారు.